క్లుప్తంగా

బ్యాంకింగ్ రంగంపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్ మహేష్

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంకింగ్ రంగంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ సీహెచ్ మహేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒకేషనల్ విద్యపై ఆసక్తి పెంచుకోవాలని చెప్పారు. 49 మంది విద్యార్థులకు పది రోజులు పాటు ఇంట్రన్షిప్ నిర్వహించనున్నట్లు ఒకేషనల్ ట్రైనర్స్ అంజిబాబు, డేవిడ్ తెలిపారు.

కొండచిలువ కలకలం


కొండచిలువ

దర్శి: స్థానిక ఎస్‌సీస్ కాలనీ వద్ద వీరాయపాలెం మేజర్‌లో ఓ కొండచిలువ సోమవారం కలకలం సృష్టించింది. ఎఫ్‌బీఓ అమర వెంటనే స్పందించి కొండచిలువను స్థానికుల సాయంతో పట్టుకుని గోతంలో వేసుకుని అడవిలో వదిలి పెట్టి వచ్చారు. మేజర్ కాలువలో కొండచిలువ రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. 12 అడుగుల పొడవు ఉన్న కొండచిలువ ప్రత్యక్షం కావడం, నిత్యం ప్రజలు సంచరించే ప్రాంతం కావడంతో దాన్ని చూసేందుకు స్థానికులు ఎక్కువ మంది అక్కడకు చేరుకున్నారు. చివరకు కొండచిలువను పట్టుకున్నారని తెలిసి స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

110 మందికి వైద్య పరీక్షలు


మాట్లాడుతున్న వైద్యాధికారి రవితేజకుమార్


కురిచేడు: స్వస్థ నారీ సశక్త పరివార్ కార్యక్రమాన్ని సోమవారం పడమర నాయుడుపాలెం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో వైద్యాధికారి రవితేజకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 110 మందికి అన్ని రకాల పరీక్షలు, గర్భిణులకు అవసరమైన వైద్య పరీక్షలు చేశారు. నోటి క్యాన్సర్, అండాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్‌కు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అర్హులకు ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన, ప్రధాన మంత్రి వయో వందన యోజన కార్డులు నమోదు చేయించారు. సూపర్‌వైజర్లు, సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎం, ఆశాలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నదే లక్ష్యం


మాట్లాడుతున్న ఎంపీడీవో మరియదాసు

పుల్లలచెరువు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఉల్లాస్ అనే కార్యక్రమం ప్రవేశ పెట్టిందని ఎంపీడీవో మరియదాసు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై వీఏఏలు, ఉపాధి సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 15 నుంచి 60 ఏళ్లలోపు ఉన్న వారికి చదువు నేర్పడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వీఏఏలు, ఉపాధి సిబ్బంది గ్రామాల్లో వలంటీర్లను గుర్తించి చదువురాని వారిని ఎంపిక చేసుకుని ప్రతి రోజు వారికి సాయంత్రం విద్యను నేర్పించాలన్నారు. మొదటి విడతగా మండలంలో 6 వేల మందికి విద్యను అందించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఏపీవో మోషే, సిబ్బంది పాల్గొన్నారు.

సెలవుల్లో అప్రమత్తంగా ఉండాలి


ఎస్సై శివ

కురిచేడు: వేసవి సెలవుల్లో సహజంగా కొందరు బంధువుల ఇళ్లకు వెళ్తుంటారని, ఆ సమయంలో ఇళ్లల్లో చోరీలు జరిగే అవకాశం ఉంటుందని, అలా వెళ్లిన వారు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎం.శివ సూచించారు. చోరీల కట్టడి కోసం ప్రజలకు ఆయన పలు సూచనలు చేశారు. ఊరికి వెళ్లాల్సి వస్తే విలువైన బంగారం, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలే తప్ప పక్కింటి వారికి, తెలిసిన వారికి ఇచ్చి మోసపోవద్దని హెచ్చరించారు. వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోవాలని, ద్విచక్ర వాహనాలకు చైన్‌తో లాక్ వెయ్యడం మంచిదన్నారు. సోషల్ మీడియాలో లొకేషన్, ట్రావెల్స్ ప్లాన్స్, ఎప్పుడు ఎక్కడికి వెళ్తున్నది పోస్టు చేయవద్దని సూచించారు. ఇంట్లో స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలు అమర్చుకోవాలని చెప్పారు.


పెద్దదోర్నాల: అమ్మ వారిని కలశాలతో ఊరేగిస్తున్న భక్తులు


త్రిపురాంతకం: బాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో ఉభయదాతల ప్రత్యేక పూజలు


దర్శి: కనకదుర్గమ్మ ఆలయంలో అన్నదానం

● దసరా నవరాత్రులు ప్రారంభం

బాలత్రిపుర సుందరీదేవిగా అమ్మవారి దర్శనం


త్రిపురాంతకం: బాలాత్రిపురసుందరీదేవి పల్లకి సేవ


కురిచేడు: కాళహస్తీశ్వరస్వామి


పుల్లలచెరువు: స్వర్ణ కావచాలంకృత దుర్గాదేవి..


దర్శి: బాలత్రిపుర సుందరీదేవిగా..


పెద్దారవీడు: రాజ్యలక్ష్మి అమ్మవారు..


దర్శి: బాల త్రిపుర సుందరీదేవిగా..


కురిచేడు: జ్ఞానప్రసూనాంబదేవి

దర్శి: విజయదశమి పండగను పురస్కరించుకుని దర్శిలో దేవీ నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవార్లను పూలమాలలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. సోమవారం కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో అమ్మవారు బాల త్రిపుర సుందరీదేవిగా దర్శనం ఇచ్చారు. ఆలయంలో తెల్లవారు జామున అమ్మవారికి పంచామృత అభిషేకాలు చేశారు. కుంకుమ పూజ, అష్టోత్తర శతనామావలి పూజా కార్యక్రమాలు చేశారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు బాల త్రిపురసుందరీ దేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. దద్దాలమ్మ ఆలయంలో అమ్మవారు బాల త్రిపుర సుందరీదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు బాల త్రిపుర సుందరీదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు.

వైభవంగా ప్రారంభమైన శరన్నవరాత్రులు

పెద్దదోర్నాల: దసరా శరన్నవరాత్ర మహోత్సవాలు ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి సోమవారం నుంచి పలు దేవాలయాల్లో గణపతి పూజతో వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలి రావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. వేద పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారికి విశేష పూజలు చేశారు. మండల కేంద్రంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. గణపతి పూజ అనంతరం అమ్మవారి మూలవిరాట్‌కు మహిళలు ఆవుపాలతో అభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు బెదరె రాంప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి శుద్ధ జలాభిషేకం, క్షీరాభిషేకం, ఫలోదాభిషేకం, పంచామృత స్నానాలు నిర్వహించగా సాయంత్రం సహస్త నామార్చన చేశారు. అమ్మవారికి మహాన్యాస పూర్వక ఏకా రుద్రాభిషేకం, చండీ పారాయణ హోమం నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు ఆలయంలో కలశస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పసిడి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం రాత్రి శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చీదెళ్ల వెంకటనారాయణ, వెచ్చా హరగోపాల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం, గ్రామ దేవత పోలేరమ్మ ఆలయం, షిర్డీ సాయి ఆలయాల్లో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి లక్ష కుంకుమార్చన తదితర కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు. స్థానిక పోలేరమ్మ ఆలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన, సహస్రనామార్చన, నవగ్రహ మండపారాధన, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పుల్లలచెరువు: మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ముటుకుల రేణుక ఎల్లమ్మదేవి ఆలయంలో ఆలయ అర్చకులు భరద్వాజశాస్త్రి ఆధ్వర్యంలో పూజలు ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు బాల త్రిపురసుందరీదేవి అవతారంగా భక్తులకు అమ్మవారు దర్శనం ఇచ్చారు. భక్తులు విరివిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడివరం రామాలయం, పుల్లలచెరువు బ్రహ్మంగారి ఆలయంలో అమ్మవారు శ్రీ స్వర్ణకావచాలంకృత దుర్గాదేవిగా భక్తులు దర్శనం ఇచ్చింది.

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో దసరా ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సోమవారం శ్రీబాల త్రిపుర సుందరిదేవీగా ఈశ్వరీ మహాదేవి దర్శనమిచ్చారు. ఉదయం 7 గంటల నుంచి గణపతిపూజ, అమృత అభిషేకం చేసి బాల త్రిపుర సుందరిదేవిగా అమ్మవారిని అలంకరణ చేశారు. పూజారి మణిబాబు శర్మ కలశ పూజ, అష్టోత్తర శత నామావళి, కుంకుమార్చనలు చేసి మహా నైవేద్యం సమర్పించారు. 2వ రోజు మంగళవారం వేద గాయత్రిగా ఈశ్వరీదేవి దర్శనమిస్తుందని భైరవానంద స్వామి తెలిపారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెదన్నపాలెం గ్రామానికి చెందిన దగ్గుల చిన్న మంగిరెడ్డి దంపతులు అల్పాహారం ఏర్పాటు చేశారు.

కురిచేడు: దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా స్థానిక శ్రీ జ్ఞానప్రసూనాంబదేవి సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి ఆలయంలోని అమ్మవారు శ్రీజ్ఞానప్రసూనాంబదేవిగా భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి విశేష కుంకుమార్చన చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

త్రిపురాంతకం: జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం త్రిపురాంతకం బాలా త్రిపురసుందరీదేవి ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గణపతిపూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, మండపారాధన, కుంకుమార్చనలు అభిషేకాలు, ప్రత్యేక పూజలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా ఉభయదాతల పూజలు, బాలపూజ, ఉదయం పల్లకిసేవ నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేక పూజలను భక్తులచే పండితుడు ప్రసాదశర్మ ఆధ్వర్యంలో జరిగాయి. ఆలయాల ఈఓ అనిల్ భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించారు. త్రిపురాంతకం శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలో నవరాత్రి మహోత్సవాల సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చనలు, ఉభయదాతల పూజలను పండితుడు విశ్వనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో జరిపించారు.

యర్రగొండపాలెం: శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా స్థానిక అమ్మవారి శాలలో అమ్మవారు వాసవి కన్యకాపరమేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవి భూదేవి సమేత కొప్పుకొండ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీలక్ష్మీదేవి అమ్మవారు బాల త్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో మహిళా భక్తులతో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి శాలలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్తమాసు అనంత వెంకట సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి చీదెళ్ల సుబ్రహ్మణ్యం, కోశాధికారి చలువాది శ్రీనివాసులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.


వై.పాలెం: కన్యకాపరమేశ్వరి అలంకరణలో అమ్మవారు

రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లె గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు భవానీ ప్రసాద్, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. రాజ్యలక్ష్మి అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాజ్యలక్ష్మి అమ్మవారు సిద్ధిలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలుగా అఖిల భారత రెడ్ల అన్నదాన సత్రం సభ్యులు వ్యవహరించారు. గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.


ఆలయం ముందు ఇబ్బంది పడుతూ వెళ్తున్న మహిళా భక్తులు

హవ్వా..ఇదేం చోద్యం!

- ఆలయ ప్రాంగణంలోకి మురుగు నీరు
- ఎన్‌ఎస్‌పీ అధికారుల నిర్లక్ష్యం
- మండిపడిన స్థానికులు, భక్తులు

దర్శి: ఇటీవల కురుస్తున్న తీవ్ర వర్షాలకు స్థానిక ఎన్ఎస్‌పీ కార్యాలయ ప్రాంగణానికి మురుగు నీరు చేరింది. ఆ కార్యాలయ అధికారులు శాశ్వత పరిష్కార మార్గం ఆలోచించకుండా సోమవారం ఆ నీటిని సమీపంలోని కనగదుర్గమ్మ తల్లి ఆలయం ఎదుటకు మళ్లించడంతో భక్తులు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. భారీ వర్షాలకు వచ్చిన నీటితో పాటు మురుగు ప్రవాహం కలిసి ఆలయం ముందుకు నీరు రావడంతో భక్తులు ఆగ్రహానికి గురయ్యారు. నవరాత్రులు నిర్వహించే సమయంలో పొక్లెయిన్ తీసుకొచ్చి తమ కార్యాలయంలోని మురుగు నీరు గుడి మందుకు ఎలా వదులుతారని ప్రశ్నించారు. కొందరు వెళ్లి ఎన్ఎస్‌పీ డీఈని ప్రశ్నించగా ఇక్కడ తమకు ఇబ్బందిగా ఉందని, అందుకే నీటిని అటు మళ్లించామని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడం, స్థానికులు విషయాన్ని నగర పంచాయతీ కమిషనర్ మహేష్‌కు తెలియజేయడంతో ఆయన వెంటనే స్పందించి ఆలయం వద్దకు వచ్చారు. అక్కడి పరిస్థితిని చూసి వెంటనే పొక్లెయిన్ తెప్పించి గుడి ముందు నుంచి కాలువ తీయించి మురుగు నీరు అక్కడ ఆగకుండా వెళ్లిపోయేలా చర్యలు తీసుకున్నారు. దీంతో కమీషనర్‌కు ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.


దగ్గరుండి కాలువ తీయిస్తున్న కమిషనర్

నూరుశాతం లక్ష్యం పూర్తి చేయాలి

● పశుసంవర్థక శాఖ జేడీ రవికుమార్

ముండ్లమూరు (దర్శి): పశువులకు గాలికుంటు టీకాలు నూరు శాతం వేయాలని పశుసంవర్థక శాఖ జేడీ బి.రవికుమార్ ఆదేశించారు. మండలంలో జరుగుతున్న గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని పోలవరం, ముండ్లమూరు గ్రామాల్లో సిబ్బంది పనితీరుపై పశుపోషకులను ఆరాతీశారు. అనంతరం సిబ్బందికి సూచనలు చేశారు. టీకాలు రోజూ ఉదయం 6.30 గంటలకు ప్రారంభించాలని జేడీ ఆదేశించారు. సహాయకులు అనూష, కుసుమ, వెంకటేశ్వర్లు, నరేంద్ర, గోపాల మిత్రలు పాల్గొన్నారు.


పశువులకు టీకా వేస్తున్న జేడీ రవికుమార్

బీసీ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం



బీసీ ఉద్యోగుల నూతన కమిటీ సభ్యులు

దర్శి: బీసీ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం కేజీబీవీ కీర్తి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ-2 బి.రమాదేవి, షేక్ ఖాదర్ మస్తాన్‌తో పాటు మండల స్థాయిలో వివిధ విభాగాల ఉద్యోగులు హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ జ్యోతిరావ్ పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పెరియార్ నాయకర్, ఛత్రపతి సాహూ మహరాజ్ దేశ ప్రజల కోసం ఎంతో త్యాగం చేశారని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని, బీసీ ఉద్యోగులు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఇటీవల జిల్లా ఉత్తమ విద్యాశాఖాధికారిగా ఎన్నికైన రమాదేవిని ఘనంగా సన్మానించారు. అనంతరం దర్శి మండల బీసీ ఉద్యోగుల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సీహెచ్ గురుబ్రహ్మం, అధ్యక్షుడిగా కేజీబీవీ కీర్తి, ప్రధాన కార్యదర్శిగా సురేష్‌బాబు, సహాధ్యక్షులుగా ఎస్‌వీ బాలసుబ్రహ్మణ్యం, పి.నజీర్, జి.వేణు, భ్రమరాంబాదేవి, కోశాధికారిగా గోపవరపు ప్రసాదరావు, అధికార ప్రతినిధులుగా బి.వెంకటరావు, ఆర్.అంజయ్య, గౌరవ సలహాదారులుగా షేక్ ఖాదర్‌మస్తాన్, ఆర్.గురుప్రసాద్, టి.రాజశేఖర్, వరకాల వెంకటేశ్వర్లు, పి.రంగారావు, షేక్ కబీర్, కార్యదర్శులుగా ఎం.శ్రీను, పి.ఖాసిం, ఎస్.ఏడుకొండలు, టి.వెంకటరావు, కేవీ నారాయణ, పి.రాంబాబు, ఆర్.బాజీవలి, బి.శ్రీను, ఎం.సుబ్బారావు, కోటేశ్వరరావు, బీవీ నారాయణ, వై.రాజు, టి.శ్రీనివాసులు, ఎస్.గోపి, మహేష్, సాయిలను ఎన్నుకున్నారు.

కాలువలు ఇలా..నీరు పారేదెలా?

పెద్దారవీడు: చెరువులకు అనుసంధానంగా ఉన్న కాలువలకు చిల్లకంప అడ్డంగా ఉండటంతో నీటి సరఫరా మందగిస్తోంది. మండలం పరిధిలోని పెద్దారవీడు, బద్వీడుచెర్లోపల్లి, ఓబులక్కపల్లి గ్రామాల చెరువులకు వర్షం నీరు వచ్చేందుకు కాలువలు అనుసంధానంగా ఉన్నాయి. కొండలు, గుట్టలు, పొలాల్లో కురిసిన వర్షం నీరు కాలువల ద్వారా చెరువులకు చేరుకుంటాయి. కాలువలకు ఇరుపక్కలా చిల్లకంప, పిచ్చిచెట్లు అడ్డంగా ఉండటంతో ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షం నీరు వేగంగా ముందుకు ప్రవహించడం లేదు. ఎక్కడికక్కడ కాలువలకు ఇరువైపులా ఉన్న గట్లు నిండిపోయి నీరు వృథాగా పోవడంతో కోతలకు గురై కట్టలు తెగిపోయే అవకాశం ఉంది. చెరువుల్లో నీరు పుష్కలంగా ఉంటే బోరు బావులకు సమృద్ధిగా నీరు వచ్చే అవకాశం ఉంటుందని రైతులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువల్లో ఉన్న చిల్లకంపను తొలగించి నీరు వేగంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


పెద్దారవీడు చెరువుకు వెళ్లే కాలువకు ఇరువైపులా పెరిగిన చిల్లకంప

ముమ్మరంగా మిరప నాట్లు


మిరప నాటుతున్న కూలీలు

దొనకొండ: మండలంలో పలు గ్రామాల్లో అన్నదాతలు ముమ్మరంగా మిరప నాట్లు నాటుతున్నారు. ఏటా సెప్టెంబర్ ప్రారంభం నుంచి నెలాఖరు వరకు మిరప నాట్లకు వాతావరణం అనుకూలంగా ఉంటుంది. పెదన్నపాలెం, వెంకటాపురం, ఇండ్లచెరువు, భూమనపల్లి, రుద్రసముద్రం, మంగినపూడి, రామాపురం, చందవరం, పోలేపల్లి, కొచ్చెర్లకోట గ్రామాల్లో మిరప నాట్లు వారం నుంచి నాటుతున్నారు. రైతులు, కూలీలు, పొలాల్లో బిజీ బిజీగా ఉన్నారు. కూలి ధరలు విపరీతంగా పెరిగాయి. దూర ప్రాంతం నుంచి మిరప నారు కొనుగోలు చేసి పొలాల్లో నాటుతున్నారు. ఎకరాకు నారు నాటాలంటే రూ.20 వేలు ఖర్చు అవుతోందని రైతులు తెలుపుతున్నారు. పొలంలో దుక్కి, మిరప నారు, కూలీలు, ఇతర ఖర్చులు కలిసి రూ.20 వేలు అవుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. గతేడాది మండలంలో సుమారు 6,500 ఎకరాలు సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అంచనా. ఈ ఏడాది కూడా నాణ్యమైన ధర ఉంటుందో లేదోనని సుమారు 4 వేల ఎకరాల్లో మాత్రమే రైతులు సాగు చేశారు. కాలం కలిసి వచ్చి మిర్చి ధర అనుకూలంగా ఉంటుందని రైతన్నలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.